అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 3 సంచిక -46 శుక్రవారం17 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



3

'జర్నలిస్ట్ వార్త' కథనంతో కదిలిన రెవెన్యూ..

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

**ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ**

**డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్**

**సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి**

**పార్టీలకు సమయం ఇవ్వాలని విన్నపం**



**న్యూఢిల్లీ, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. **మిగతా 2లో...**

## 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?

**9వ తరగతిలో మూడో భాషను ఆపేయాలన్న కోర్టు**

**ఇది విద్యార్థులపై అనవసర ఒత్తిడి పెంచుతుందని వ్యాఖ్య**

**కొత్త భాషను 6వ తరగతిలోనే ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచన**

**తమిళనాడులో నవోదయ కేసు విచారణలో ఈ వ్యాఖ్యలు**




**న్యూఢిల్లీ, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టాలన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పదో తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులపై ఇది అదనపు భారాన్ని మోపుతుందని, వారిని తీవ్ర ఒత్తిడికి **మిగతా 2లో...**

## పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

**నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది **మిగతా 2లో...**

# సీతారామను పూర్తి చేస్తాం




**గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం**

**నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం**

**ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృధా**

**సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు**

**ఖజనాపై భారం మోపారన్న డిప్యూటి సిఎం భట్టి**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల **మిగతా 2లో...**

## కాలేజీ వ్యవహారంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

**హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో ఇస్లామిక్ పాఠాల వివాదం**

**సీరియస్‌గా స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్**

**తెలంగాణ విద్యాశాఖ అధికారులకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ**

**రెండు వారాల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం**




**హైదరాబాద్, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇస్లామిక్ మతపరమైన పాఠాలు, ప్రార్థనలను తప్పనిసరి చేశారన్న ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, రెండు వారాల్లోగా 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' (ఏటీఆర్) సమర్పించాలని తెలంగాణ విద్యాశాఖ అధికారులకు, హైదరాబాద్ జిల్లా యంత్రాంగానికి నోటీసులు జారీ చేసింది. **మిగతా 2లో...**

## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**బిజినెస్ జాబితాను విడుదల చేసిన సెక్రటరీ జనరల్**



**న్యూఢిల్లీ, జూలై 16:**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల **మిగతా 2లో...**

## ఈ నెల 22న తల్లికి వందనం

**అమరావతి, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఈ పథకం అమలు, మార్గదర్శకాల కోసం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం జీవో నెం.15, జీవో నెం.16 జారీ చేశారు. ఈ పథకం కోసం రూ.10,120.78 కోట్లు **మిగతా 2లో...**




## బోనమెత్తిన గోల్కొండ

**గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు**

**అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు**

**కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు**

**వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ**

**హైదరాబాద్, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు **మిగతా 2లో...**



## పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

**ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా**

**త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ **మిగతా 2లో...**



## జగన్నాథ రథయాత్రలో అపశృతి

**తొక్కిసలాటలో ఒకరు మృతి**

**వందమందకి పైగా భక్తులకు గాయాలు**



# కాలేజీ వ్యవహారంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

**మొదటిపేజీ తరువాయి**

హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలో ఉన్న 'సక్సెస్ ది జూనియర్ కళాశాల' యాజమాన్యం విద్యార్థుల అధికారిక డైరీలలో ఇస్లామిక్ పాఠాలు, ప్రార్థనలను హోంవర్క్‌గా ఇస్తోందని ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు అందింది. తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, యాజమాన్యం పదేపదే ఇందుకు పాల్పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై నిలదీయగా "పొరపాటున జరిగింది" అని యాజమాన్యం బదులిచ్చినప్పటికీ, వారు ఎటువంటి సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేదని ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని ధర్మాసనం, ఈ ఆరోపణలు నిజమైతే ఇది విద్యార్థుల హక్కులను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అభిప్రాయపడింది. ఇది భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన విద్యావ్యవస్థలోని లౌకిక స్ఫూర్తికి విఘాతమని పేర్కొంది. ఈ నేపథ్యంలో తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, హైదరాబాద్ జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేస్తూ, సమగ్ర నివేదిక కోరింది.

ఇదే పేరుతో ఉన్న 'సక్సెస్ స్కూల్' ప్రాథమిక పాఠశాలలో కూడా ఇటీవల ఇటువంటి వివాదమే చెలరేగింది. ఒక హిందూ విద్యార్థికి 'కల్మా'ను కంఠస్థం చేయాలని హోంవర్క్ ఇచ్చిన రెండో తరగతి ఉపాధ్యాయురాలిని అప్పట్లో యాజమాన్యం తొలగించింది. తాజా ఘటనతో విద్యాసంస్థల్లో మతపరమైన సున్నితత్వ అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

**మొదటిపేజీ తరువాయి**

జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్–సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్ట్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రర్బా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే

ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

# సీతారామను పూర్తి చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్ఠంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ–డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ–డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన



పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్

హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్టును తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కోనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# బోనమెత్తిన గోల్కొండ

**మొదటిపేజీ తరువాయి**

చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.



# ఎపిలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధం

## సెప్టెంబర్‌లో మున్సిపల్ ఎన్నికలతో ప్రారంభం




**అమరావతి జూలై 16: (జర్నలిస్ట్ వార్త)** స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నాయి. తొలుత మున్సిపల్ ఎన్నికలను సెప్టెంబర్‌లో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవలే ఈ ఎన్నికలకు సంబంధించి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనుంది. ఆ తర్వాత గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని ప్రాథమికంగా ఏపీ సర్కార్ భావిస్తోంది. ఈ నెల 27వ తేదీ నుంచి 45 రోజుల పాటు తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రతిపక్ష నేతల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. డోర్ టూ డోర్ క్యాంపెయిన్ ఎన్నికల ప్రచారంగా ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. ఈ మేరకు జోనల్ కోఆర్డినేటర్లు, పార్టీ నేతల సమావేశంలో టీడీపీ అగ్రనేతలు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఖాళీగా ఉన్న నియామక పదవులన్నింటిని వెంటనే భర్తీ చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

**మొదటిపేజీ తరువాయి**

బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు.

ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు–2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?

**మొదటిపేజీ తరువాయి**

గురిచేస్తుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం విచారణ సందర్భంగా కోర్టు కీలకమైన మౌఖిక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టడం సరికాదు. ఆ వయసులో విద్యార్థులు ఇప్పటికే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. అటువంటి సమయంలో కొత్త భాషను ఎందుకు పరిచయం చేస్తారు? అవసరమైతే ఆరో తరగతి నుంచే దీని అమలు చేయండి" అని జస్టిస్ నాగరత్న కేంద్రానికి సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షల తాలూకు ఒత్తిడి ఎనిమిదో తరగతి నుంచే మొదలవుతుందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2026–27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న సీబీఎస్ఈ నూతన నిబంధనల ప్రకారం, 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. అందులో కనీసం రెండు భారతీయ భాషలు ఉండటం తప్పనిసరి. ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు, దీని అమలుపై స్టే ఇచ్చేందుకు మాత్రం అప్పట్లో నిరాకరించింది. తమిళనాడులో ద్విభాషా విధానం అమల్లో ఉన్న నేపథ్యంలో, నవోదయ పాఠశాలల ఏర్పాటుపై కోర్టు ప్రత్యేకంగా ప్రస్తావించింది. త్రిభాషా సూత్రంలో హిందీ తప్పనిసరి కాదని, సంస్కృతం లేదా ఇతర ప్రాంతీయ భాషలను ప్రత్యామ్నాయాలుగా పరిశీలించవచ్చని పేర్కొంది. నవోదయ విద్యాలయాలకు భూ కేటాయింపులపై తగిన నిర్ణయం తీసుకునేందుకు తమిళనాడు ప్రభుత్వానికి ఆగస్టు 11 వరకు సమయం ఇచ్చింది. ప్రస్తుత విచారణలో కోర్టు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ధర్మాసనం చేసిన మౌఖిక వ్యాఖ్యలు విద్యా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

**మొదటిపేజీ తరువాయి**

ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కల్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కల్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

# ఈ నెల 22న తల్లికి వందనం

**మొదటిపేజీ తరువాయి**

మంజూరు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 42,70,802 మంది తల్లులకు, వారి 67,47,190 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. జులై 22వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నారు. విద్యార్థుల్లో డ్రాపౌట్లను తగ్గించి, వారి చదువులో తల్లుల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. గత విద్యా సంవత్సరం (2025–26) నుంచి అమలవుతున్న ఈ పథకం కింద, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లికి, వారి పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఒక్కో బిడ్డకు ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్–ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

# జగన్నాథ రథయాత్రలో అపశృతి

## తొక్కిసలాటలో ఒకరు మృతి

## వందమందకి పైగా భక్తులకు గాయాలు

**పూరీ, జులై 16: (జర్నలిస్ట్ వార్త)** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బమది తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్చినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.

# 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి**

చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై తుది నిర్ణయం తీసుకోనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. ఓ÷ూఓఇ రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సరికొత్త బిల్లులను ఈ సమావేశాల్లో తీసుకురానుంది. ÷ూష్ట్రాలు సొంతంగా ఓ÷ూఓఇ ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు నిధుల వ్యయంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనుంది. ఆగస్ట్ 13వ తేదీతో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

# బీరప్ప గుడి పేరుతో ఆక్రమణకు బ్రేక్

## 'జర్నలిస్ట్ వార్త' కథనంతో కదిలిన రెవెన్యూ.. కనీలు తొలగించాలంటూ ఆదేశాలు

## ప్రభుత్వ సీలింగ్ భూమిలో ఎలాంటి నిర్మాణాలూ వద్దని హెచ్చరిక

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 17 (జర్నలిస్ట్ వార్త):**




దేవునూరు గ్రామంలో బీరప్ప గుడి పేరుతో ప్రభుత్వ సీలింగ్ భూమిని ఆక్రమిస్తున్నారన్న ఆరోపణలపై రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరులోని సర్వే నంబర్ 536లో ఉన్న సుమారు 460 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిలో 22 గుంటల మేర రాతి కనీలు నాటినట్లు గ్రామస్తులు ఆరోపించడంతో పాటు, రైతుల రాకపోకలకు ఆటంకం కలుగుతోందంటూ జర్నలిస్ట్ వార్త'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు.
తహసీల్దార్ బావ్‌సింగ్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, గ్రామ పంచాయతీ అధికారి శంకర్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. గుడి కమిటీ ప్రతినిధులతో మాట్లాడిన అధికారులు ప్రభుత్వ సీలింగ్ భూమిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని, ఇప్పటికే నాటిన రాతి కనీలను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు.
ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నాలు చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడి కోసం భూమి అవసరమైతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులను ఆశ్రయించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకునేందుకు సహకరించాలని కోరారు.

### బీరప్ప గుడి పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమణ?

**దేవునూరులో 22 గుంటల్లో ఖనిల్ నాటినట్లు గ్రామస్తుల ఆరోపణ**

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 15 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవనూరు గ్రామంలోని సర్వే నంబర్ 536లో ఉన్న సుమారు 460 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి ఉంది బీరప్ప గుడి పేరుతో సుమారు 22 గుంటల స్థలాన్ని ఆక్రమించి ఖనిల్ (రాతి స్తంభాలు) నాటినట్లు బుధవారం గ్రామస్తులు ఆరోపించారు. ఈ భూముల గుండా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో ఇదే ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నం జరిగిన సమయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిత అక్కడికి చేరుకుని పనులను నిలిపివేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే కొంతకాలం విరామం తర్వాత మళ్లీ అదే ప్రాంతంలో పనులు ప్రారంభించారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలని, ప్రభుత్వ భూమిపై ఆక్రమణ జరిగినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని దేవనూరు గ్రామస్తులు కోరుతున్నారు.




బీరప్ప గుడి పేరుతో ఆక్రమించిన భూమిపై విచారణ చేపడుతున్న ఆర్ ఐ అశోక్ రెడ్డి

# పోయిన మొబైళ్లు బాధితులకు అప్పగింత



**హసన్‌పర్తి,/ జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను హసన్‌పర్తి పోలీసులు బాధితులకు బుధవారం అందజేశారు. పోగొట్టుకున్న మొబైళ్లపై వచ్చిన ఫిర్యాదులను కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి, ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సాంకేతిక నిఘా నిర్వహించి ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ బాధితులకు మొబైల్ ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సంచార్ సాథి వెబ్‌సైట్‌లోని సీఈఐఆర్ సేవ ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేస్తే దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు రికవరీకి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ టీమ్ సభ్యులు వెంకట్, తిరుపతి, సీఈఐఆర్ ఆపరేటర్లు పూర్ణాచారి, సోమన్న, గీత, ప్రణవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ



**హసన్‌పర్తి,/ జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**
హనుమకొండ జిల్లాలోని బీసీ గురుకుల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ ఆర్‌సీఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ జిల్లాలోని బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావం నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుపై అవగాహన

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూలై 16: (జర్నలిస్ట్ వార్త)**



ఎల్నినో ప్రభావంతో నెలకొనే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రమాదేవి సూచించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మలక్‌పల్లి గ్రామపంచాయతీలో గురువారం గ్రామ సర్పంచ్ గిన్నగారి లత అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ, కంది, పొద్దుతిరుగుడు, జొన్న, సజ్జ, రాగులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటితో కూరగాయలు, పామాయిల్ వంటి ప్రత్యామ్నాయ పంటలను కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఒక ఎకరం వరికి వినియోగించే నీటితో ఐదు నుంచి ఆరు ఎకరాల ఆరుతడి పంటలను సాగు చేయవచ్చని వివరించారు. పంటలు బెట్టకు గురైనప్పుడు ఎన్‌పీకే లేదా యూరియా, మల్టీకే వంటి ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగిస్తే పంటలకు తక్షణ శక్తి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న రెండు నెలలు వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందున రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, పంట మార్పిడిని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిన్నగారి లత, ఏఈఓ రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

# బ్లాక్ మార్కెట్‌కు తరలించేలోపే పట్టేసిన పోలీసులు

## ఎల్లాపూర్‌లో 7.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం.. నిందితుడిపై కేసు

**హసన్‌పర్తి, /జూలై 16 (జర్నలిస్ట్ వార్త):**
పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు నిల్వ ఉంచిన వ్యక్తిని హసన్‌పర్తి పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడిలో 7 క్వింటాళ్ల 50 కిలోల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం.. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ డి. యాదగిరి, కానిస్టేబుళ్లు పి. ధనుంజయ్య, ఎం. భరత్‌తో కలిసి ఎల్లాపూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, దండుగుల రమేష్ ఇంటి సమీపంలోని షెడ్డులో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. వెంటనే ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో దాడి నిర్వహించగా,



16 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యం లభ్యమైంది. విచారణలో నిందితుడు దండుగుల రమేష్ (42) చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కిలో రూ.10 చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, కిలో రూ.30కు విక్రయించేందుకు నిల్వ ఉంచినట్లు అంగీకరించాడు. తూకం వేయగా మొత్తం 7 క్వింటాళ్ల 50 కిలోల బియ్యం ఉన్నట్లు తేలింది. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.21 వేలగా పోలీసులు అంచనా వేశారు.

**కఠిన చర్యలు తప్పవు: ఇన్‌స్పెక్టర్**

ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల కోసం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిరుపేదల రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు, నిల్వ, రవాణా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# వేమ్సూరు చెరువుకు గోదావరి జలాలు

## రైతులు, గ్రామస్తుల్లో హర్షం



**వేమ్సూరు,/ జూలై 16 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని పచ్చగన్నేరు కుంటకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఎన్ఎస్‌పీ కాలువకు వచ్చిన గోదావరి జలాలు లిఫ్ట్ ద్వారా ఎన్‌టీఆర్ కాలువ మార్గంగా గురువారం చేరాయి. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు పశువులకు తాగునీటి కొరత ఏర్పడిన వేళ కుంటలోకి గోదావరి జలాలు చేరడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కుంట కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందడంతో పాటు పశువుల తాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారమవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరి జలాల విడుదలకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు బొంతు భాస్కరరావు, లిఫ్ట్ చైర్మన్ ఎండీ ఫైజుద్దీన్, మోరంపూడి భాస్కరరావు, జాజిసెట్టి కోటేశ్వరరావు, లక్ష్మయ్య, రాము, సర్పంచ్ ప్రకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం

## 'డబుల్ బెడ్‌రూం' అంటూ గొప్పలు చెప్పిన వాళ్లు.. ధర్మసాగర్‌కు ఒక్క ఇల్లైనా ఇచ్చారా?

## దేవాదులే ఉమ్మడి జిల్లాకు జీవనాడి.. ప్రజలు సహకరిస్తే నాలుగు లైన్ల రహదారి: కడియం శ్రీహరి





**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జూలై 16 (జర్నలిస్ట్ వార్త):** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వమే నిజం చేసిందని, రెండేళ్లలో రూ.35 వేల కోట్లతో 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రచారం తప్ప ధర్మసాగర్ వంటి పెద్ద గ్రామ పంచాయతీకి ఒక్క ఇల్లైనా ఇవ్వలేదని విమర్శించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో రూ.92 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, నూతన ఇందిరమ్మ ఇళ్లను గురువారం ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన రెండున్నరేళ్లలో ధర్మసాగర్‌లో రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని, ఒక్కరోజే రూ.92 లక్షల పనులను ప్రారంభించడం ఇందుకు నిదర్శనమన్నారు. దేశవ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అలాంటి సమయంలో దేవాదుల ఎత్తిపోతల పథకం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయినిగా నిలుస్తోందన్నారు. తన రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన ప్రాజెక్టు దేవాదులేనని పేర్కొన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరిన తర్వాత స్టేషన్ ఘనపూర్, నవాబ్‌పేట, అశ్వరావుపల్లి, గండి రామారం, చిటకోడూరు, బొమ్మకూరు రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ధర్మసాగర్‌కు రెండో విడతలో మరో 100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన ఆయన, అర్హులైన పేదలకు రాజకీయాలకు అతీతంగా ఇళ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓఆర్ఆర్ నుంచి ఎల్కుర్తి క్రాస్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి గ్రామ ప్రజలు సహకరిస్తే పనులు పూర్తి చేయించే



బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# వర్షాభావం.. రైతాంగానికి గడ్డు పరీక్ష

## ప్రకృతి సహకరించకపోతే పాలకులే అండగా నిలవాలి

వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ముఖ్యంగా తెలంగాణ వంటి వ్యవసాయాధారిత రాష్ట్రాల్లో రైతు పరిస్థితి బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చైతన్యంగా ఉంటుంది. కానీ ఈ ఏడాది రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపకపోవడం, అనేక జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, మధ్య మధ్యలో కురిసిన చిరు జల్లులు తప్ప సరైన వానలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఆకాశం వైపు ఆశగా చూస్తూ రోజులు గడుపుతున్న అన్నదాతకు ప్రతి రోజు గడవడం ఒక పరీక్షగా మారింది.తొలకరి వర్షాలను నమ్ముకుని లక్షలాది మంది రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకున్నారు. అప్పులు చేసి విత్తనాలు కొనుగోలు చేశారు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరించారు. కొందరు బోర్లపై ఆధారపడి విత్తనాలు చల్లగా, మరికొందరు వర్షం వస్తుందనే నమ్మకంతో సాగు ప్రారంభించారు. కానీ ఆశించిన వర్షాలు లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తిన చోట పంటలు ఎండుముఖం పట్టాయి. కొన్ని ప్రాంతాల్లో రైతులు రెండోసారి విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టుబడి రెట్టింపై ఆర్థిక భారం మరింత పెరిగింది.వర్షాభావం ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం దీనివల్ల కుదేలవుతోంది. వ్యవసాయ కూలీలకు పనులు లేక ఉపాధి కోల్పోతున్నారు. విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులు కూడా నష్టాలను చవిచూస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రవాణా, చిన్న వ్యాపారాలు, మార్కెట్ కార్యకలాపాలు మందగిస్తున్నాయి. ఒక పంట విఫలమైతే దాని ప్రభావం మొత్తం గ్రామీణ జీవన విధానంపై



పడుతుంది.ఇక సాగునీటి పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. చెరువులు, కుంటలు నిండకపోవడంతో నీటి నిల్వలు తగ్గిపోయాయి. భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో అనేక బోర్లు ఎండిపోతున్నాయి. విద్యుత్ ఉన్నా నీరు లేక మోటార్లు పనిచేయని పరిస్థితి ఏర్పడుతోంది. పశువులకు మేత, తాగునీరు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశుసంపద కూడా ప్రమాదంలో పడుతోంది.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించే తీరు అత్యంత కీలకం. కేవలం ప్రకటనలు చేయడం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించాలి. ప్రతి మండలంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయాలి. రైతులు దరఖాస్తుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే సర్వే పూర్తి చేయాలి. పంట నష్టం నిర్ధారణ అయిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రైతులకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించకపోతే అప్పుల ఊబిలో మరింత కూరుకుపోయే ప్రమాదం ఉంది.

పంట రుణాల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలి. రుణాల రీషెడ్యూలింగ్, వడ్డీ రాయితీలు, అవసరమైతే స్వల్పకాలిక రుణ మాఫీ వంటి అంశాలను పరిశీలించాలి. సహకార, జాతీయ బ్యాంకులు రైతులపై ఒత్తిడి తీసుకురాకుండా తగిన మార్గదర్శకాలు జారీ చేయాలి. ప్రైవేటు అప్పుల బారిన పడిన రైతులకు కూడా చట్టపరమైన రక్షణ కల్పించే చర్యలు అవసరం.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలి. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలి. నాణ్యమైన విత్తనాలు సబ్సిడీపై అందించాలి. ప్రతి రైతుకు గ్రామస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి శాస్త్రీయ సలహాలు అందించాలి. దీర్ఘకాలిక పరిష్కారాలపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులకు అధిక సబ్సిడీలు ఇచ్చి రైతులను ప్రోత్సహించాలి. ప్రతి గ్రామంలో నీటి వినియోగంపై సమగ్ర ప్రణాళిక అమలు చేయాలి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ విధానాలను కూడా కాలానుగుణంగా మార్చాల్సిన అవసరం ఉంది.వ్యవసాయ బీమా పథకాలను మరింత సమర్థంగా అమలు చేయడం కూడా అత్యంత అవసరం. పంట నష్టం జరిగిన వెంటనే రైతులకు బీమా పరిహారం అందే విధంగా ప్రక్రియను సులభతరం చేయాలి. నష్టపరిహారం నెలల తరబడి ఆలస్యం కాకుండా కాలపరిమితి నిర్ణయించాలి. రైతులకు వాతావరణ సూచనలు, పంటల నిర్వహణపై మొబైల్ సందేశాలు, గ్రామసభలు, వ్యవసాయ శిక్షణ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలి.ప్రకృతి వైపరీత్యాలను ఎవరూ ఆపలేరు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించే బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వ నిర్ణయాలే అతనికి ధైర్యం ఇస్తాయి. వ్యవసాయం బలహీనపడితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. రైతు నష్టపోతే ఆ ప్రభావం వినియోగదారుడిపై కూడా పడుతుంది. అందువల్ల వర్షాభావాన్ని కేవలం వ్యవసాయ సమస్యగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశంగా ప్రభుత్వం పరిగణించాలి.

అన్నదాత కష్టపడితేనే ప్రతి ఇంట్లో అన్నం ఉడుకుతుంది. అలాంటి రైతు నేడు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. అతని కళ్లలోని ఆందోళనను తొలగించడం, అతనికి భరోసా కల్పించడం, పంటను కాపాడడం, భవిష్యత్తుకు భద్రత కల్పించడం పాలకుల బాధ్యత. వర్షాభావాన్ని ఎదుర్కొనే తక్షణ చర్యలతో పాటు శాశ్వత నీటి నిర్వహణ విధానాలను అమలు చేసినప్పుడే రైతు నవ్వుతాడు. రైతు నవ్వితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. అదే నిజమైన సుస్థిర అభివృద్ధికి నిదర్శనం



**సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)**
**జిల్లా కార్యవర్గ సభ్యులు**
**టీయూడబ్ల్యూజేయు**
**(ఐజేయూ)9908401581**

## భరత్ చంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు.

**బయ్యారం/,జులై 16(జర్నలిస్ట్ వార్త)**
మహబూబాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు భరత్ చంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భరత్ చంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఆయనకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు,దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్ నాయక్,సొసైటీ డైరెక్టర్స్ తిరుమల ప్రభాకర్ రెడ్డి,చాగర్లమూడి భాస్కర్,కాంగ్రెస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ యూత్ అధ్యక్షులు చెరుకుపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లాపూర్ చేపల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా మత్స్యశాఖ అధికారి

**హసన్‌పర్తి,/ జూలై 16:( జర్నలిస్ట్ వార్త)**హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ చేపల ఉత్పత్తి కేంద్రాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి బుధవారం పరిశీలించారు. కేంద్రాన్ని రక్షించి పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగతో పాటు గ్రామస్థులు ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, దానిపై స్పందించిన అధికారులు స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 246లో మొత్తం 12 ఎకరాల 13 గుంటల భూమిలో 2 ఎకరాల 16 గుంటలు చేపల ఉత్పత్తి కేంద్రానికి కేటాయించారని తెలిపారు. ఈ కేంద్రంలో చేపల పెంపకానికి అవసరమైన బావి, గోదాం, భవనాలు,



హౌస్‌లు ఉన్నాయని వివరించారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేంద్రంలోని నిర్మాణాలను కూల్చివేసి భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించి చేపల ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాలని, భూమిని ప్రభుత్వ అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. పరిశీలన అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి నివేదికను జిల్లా కలెక్టర్‌కు




సమర్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మోతె లింగారెడ్డి, నేదునూరి సునీల్, మోతె మధుసూదన్ రెడ్డి, గంగిళ్ల వెంకట్ రెడ్డి, ఎండీ షేక్ బాబా, వెలిసోజు బుచ్చిరాములు, ఎర్ర మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పవర్ ప్లాంట్‌లో మద్యం దందా?

### వలస కార్మికులే లక్ష్యం.. రోజూ అక్రమ సరఫరాపై ఆరోపణలు

**దామరచర్ల, /జూలై 16 (జర్నలిస్ట్ వార్త):**
దామరచర్ల మండలంలోని వీర్లపాలెం చౌరస్తా వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) పరిసరాల్లో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాంట్‌లో బీహార్, రాజస్థాన్,




అస్సాం, గుజరాత్ రాష్ట్రాలతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన సుమారు 5 వేల నుంచి 6 వేల మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వలస కార్మికుల్లో కొందరు మద్యానికి అలవాటు పడటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దామరచర్లలోని ఓ మద్యం దుకాణం నుంచి నిత్యం ప్లాంట్ ప్రాంతానికి మద్యం తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ప్లాంట్ పరిసరాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారంపై ఎక్సైజ్, పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమ మద్యం సరఫరాపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## బయ్యారంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, జలాభిషేకం.

**బయ్యారం/,జులై 16.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని గంగ బజార్ కాలనీలో కొలవైఉన్న గంగమ్మ తల్లి విగ్రహానికి మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించి జలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు మాట్లాడుతూ రెండు నెలలుగా తీవ్ర వర్షాభావం కారణంగా రైతులు దుక్కులు దున్నుకొని విత్తనాలు భూమిలో చల్లుకున్నారని రైతులు నష్టపోకుండా గంగమ్మ తల్లి దీవెనలతో సమృద్ధిగా వరుణ దేవుడు వర్షాలు కురిపించాలని గంగమ్మ తల్లిని మహిళలు వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరబోయిన రాములమ్మ,విజయ,ములుకురి ప్రమీల,రాధమ్మ,సత్యవతి, నీలారపు సునీత, సంతోష,మాజీ ఉప సర్పంచ్ కవిత,తదితరులు పాల్గొన్నారు.




## వర్షాభావం.. వరికి బదులు ఆరుతడి పంటలు దేవునూరులో రైతులకు అవగాహన




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 16: (జర్నలిస్ట్ వార్త :)**రానున్న రెండు నెలలు వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశమున్నందున రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. దేవునూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఈ మేరకు పలు సూచనలు చేశారు.భారత వాతావరణ శాఖ ముందస్తు అంచనాల ప్రకారం వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో కోతలు కూడా ఉండవచ్చని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా పెసర, మినుము, కంది, నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, సజ్జ, రాగులు వంటి ఆరుతడి పంటలను జూలై 30లోపు సాగు చేయాలని సూచించారు. తక్కువ కాలపరిమితి గల కూరగాయలు, పామాయిల్‌తో పంట మార్పిడి చేపట్టడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు భూసారం మెరుగుపడి దిగుబడులు పెరుగుతాయని వివరించారు.వర్షాభావంతో పంటలు బెట్టకు గురైతే ఎకరానికి ఒక కిలో ఎన్‌పీకే లేదా నాలుగు కిలోల యూరియా, రెండు కిలోల మల్టీ-కే కలిపి పిచికారీ చేయడం ద్వారా పంటలకు తక్షణ శక్తి అందుతుందని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హింగే రవీందర్, వ్యవసాయ విస్తరణ అధికారి ముజాహిద్, పంచాయతీ కార్యదర్శి రూప, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మట్టి మాఫియాపై గీసుగొండ ఖాకీల మెరుపు దాడి జేసీబీ, ట్రాక్టర్లు సీజ్

**గీసుగొండ/జూలై 16 (జర్నలిస్ట్ వార్త);**
అనుమతులు లేవు.నిబంధనలు అసలే లేవు. ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్న మట్టి మాఫియాకు గీసుగొండ పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. ఊకల్ గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అక్రమ మట్టి రవాణాపై పోలీసులు గురువారం మెరుపు దాడి నిర్వహించారు.రంగంలోకి దిగిన



పోలీసులు మట్టిని తరలిస్తున్న ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను రాత్రికి రాత్రే పట్టుకొని సీజ్ చేశారు. తప్పించుకునే ప్రయత్నం చేసిన డ్రైవర్లను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, అనుమతులు లేకుండా సహజ సంపదను కొల్లగొడితే ఎంతటి వారైనా వదిలేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌ఓ డి. విశ్వేశ్వర్ ఈ సందర్భంగా గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

# భాస్కర్ అంతిమయాత్రలో కదంతొక్కిన ఎమ్మార్పీఎస్


## హంతకులపై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్!

**బాధిత దళిత కుటుంబానికి అండగా నిలిచిన మాదిగ దండు**

**తమ్ముడబోయిన రాజు యాదవ్‌తో పాటు సహకరించిన వారందరినీ కఠినంగా శిక్షించాలి**

**రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత బిర్రు మహేందర్ మాదిగ డిమాండ్**

**ఉప్పరపల్లిలో నినాదాల హోరు.. విజయవంతంగా ముగిసిన అంతిమయాత్ర**


















మాట్లాడుతున్న నాయకులు బిర్రు మహేందర్

**వర్ధన్నపేట/జూలై 16(జర్నలిస్ట్ వార్త);**వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో కుల పరువు హత్యకు గురైన శీనపల్లి భాస్కర్ మాదిగ (30) అంతిమయాత్ర బుధవారం ఉద్రిక్త, భావోద్వేగ భరిత వాతావరణంలో సాగింది. ప్రేమ వివాహం చేసుకున్నాడన్న కక్షతో జరిగిన ఈ దారుణ హత్య పై దళిత సమాజం భగ్గుమంది. భాస్కర్ అంత్యక్రియల సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకత్వం భారీ సంఖ్యలో తరలివచ్చి, గ్రామ దళితులకు, శోకసముద్రంలో మునిగిపోయిన భాస్కర్ తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కొండంత బాసటగా నిలిచింది.

**హంతకులపై పీడీ యాక్ట్ పెట్టాలి. బిర్రు మహేందర్ మాదిగ**

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ జిల్లా ధర్మయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ అంతిమయాత్రలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భాస్కర్‌ను పొట్టనబెట్టుకున్న ప్రధాన నిందితుడు తమ్మడబోయిన రాజు యాదవ్‌తో పాటు, అతని కుటుంబ సభ్యులను, ఈ దారుణ హత్యకు వెనుక ఉండి సహకరించిన వారందరిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యా నేరం కింద కఠినమైన సెక్షన్లతో కేసులు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా శిక్షపడేలా చూడాలన్నారు. అన్యాయంగా బలిఐపోయిన భాస్కర్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**నినాదాలతో హోరెత్తిన ఉప్పరపల్లి..**

అంతిమయాత్ర సాగినంత సేపూ నిందితుడు తమ్మడబోయిన రాజు యాదవ్‌ను, అతని అనుచరులను కఠినంగా శిక్షించాలంటూ సాగిన నినాదాలతో ఉప్పరపల్లి గ్రామం హోరెత్తింది. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని దళిత సంఘాల నాయకులు స్పష్టం చేశారు. కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు మధ్య దళిత సామాజిక వర్గంతో పాటు, ఊరంతా ఏకమై అంతిమయాత్రను విజయవంతం చేసింది.

**భారీగా తరలివచ్చిన నాయకులు, ప్రజలు..**

ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ, మాదిగ జర్నలిజం ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ మాదిగ, ఎంఎస్పీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేష్ మాదిగ పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి సీనేపల్లి రాజు మాదిగ, మండల ఉపాధ్యక్షులు చాడ కరుణాకర్ మాదిగ, ఎంఎస్పీ మండల అధికార ప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగతో పాటు పలువురు కుల పెద్దలు, మహిళలు, యువకులు, విద్యార్థులు, బంధుమిత్రులు భారీ సంఖ్యలో తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

## ఓటు నమోదు చేసుకోండి.. దేశ భవిష్యత్తును నిలబెట్టండి

**ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలి**

**బీఆర్ఎస్ మాజీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కొట్టే ప్రవీణ్**



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 16 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మాజీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కొట్టి ప్రవీణ్ పిలుపునిచ్చారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత కూడా అని అన్నారు.ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ తిరుగుతూ అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకొని 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని కోరారు.ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని, పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు ఎంతో కీలకమని పేర్కొన్నారు.కులం, మతం, డబ్బు, ప్రలోభాలకు అతీతంగా ప్రజా సంక్షేమం కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించి దేశ అభివృద్ధికి భాగస్వామి కావాలని కొట్టే ప్రవీణ్ కోరారు

## నేడు హైదరాబాదులో అమరజ్యోతి ప్రాంగణంలో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.

**-నాయిని శ్రీనివాస్ రెడ్డి.**




**బయ్యారం/,జులై 16.(జర్నలిస్ట్ వార్త)** డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఫోరం కృషి ఫలితమే కమిటీ ఏర్పాటు జరిగిందని, ఇలాగే కమిటీని కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకోబోమని మరో ఉద్యమానికి ఉద్యమకారులంతా సిద్ధం అవుతామని ఉద్యమకారుల జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి అన్నారు.నేడు హైదరాబాదులోని సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమర జ్యోతి ప్రాంగణానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ జిల్లా నుండి ఉద్యమకారులంతా బయలుదేరాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు.తెలంగాణ ఉద్యమకారుల మనోభావాలకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చూస్తూ ఊరుకోమని,కమిటీల పేరుతో ఆలయాపన చేస్తే మరో ఉద్యమానికి సిద్ధంగా మహబూబాబాద్ ఉద్యమకారులు సిద్ధంగా ఉండాలని శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

## నేడు ఉప్పరపల్లికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేతలు..

**వర్ధన్నపేట/జులై 16 (జర్నలిస్ట్ వార్త):** పరువు హత్యకు గురైన శీనపల్లి భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకత్వం నేడు (శుక్రవారం) ఉప్పరపల్లి గ్రామానికి చేరుకోనుంది. ఈ మేరకు దళిత రత్న అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ మాదిగకు ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ స్వయంగా ఫోన్ చేసి దిశానిర్దేశం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించే వరకు బాధితులకు అండగా ఉండి పోరాటాన్ని సాగించాలని ఆయన ఆదేశించారు. కుల పరువు హత్యకు కారణమైన దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టం ముందు వారిని నిలబెట్టే వరకు ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## పోలీస్ పహారాలో భాస్కర్ అంతిమయాత్ర.. ఆంక్షల నీడలో వీడ్కోలు

**ఒక సామాన్యుడి అంత్యక్రియలకు ఎన్నడూ లేని విధంగా 100 మందికి పైగా బలగాలు**

**మండల కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారిన ఖాకీల బందోబస్తు**

**ఎట్టకేలకు ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న ఉన్నతాధికారులు**











**వర్ధన్నపేట/జులై 16(జర్నలిస్ట్ వార్త):**
ఒక సామాన్య యువకుడి అంతిమయాత్ర, అక్కడ మోహరించిన బలగాలను చూస్తే ఏదో హై-ప్రొఫైల్ వీఐపీ పర్యటనను తలపించింది. హైదరాబాద్ మాదాపూర్‌లో జరిగిన పరువు హత్య బాధితుడు, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సీనపెల్లి భాస్కర్ (30) మంగళవారం రాత్రి కత్తి, రాడ్లు, కర్రలతో హత్యచేసిన, భాస్కర్ మృత దేహాన్ని హైదరాబాద్ లో పోస్ట్ మఠం చేసి, బుధవారం రాత్రి ఉపరపెలల్లి గ్రామానికి చేరుకోగా అంత్యక్రియలు గురువారం పోలీస్ పహారా నడుమ ముగిశాయి. ప్రేమ వివాహమే పాపమై కిరాతకుల చేతిలో బలైన భాస్కర్ భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు, ఈ విషాదం వెనుక గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, పోలీసుల వ్యూహాత్మక అడుగులు ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి.

**మండల చరిత్రలోనే మొదటిసారి..**

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో అంత్యక్రియలకు ఊరంతా తరలిరావడం సహజం, ఈ పరువు హత్య ఉదంతం తీవ్ర సంచలనం సృష్టించడంతో, ఉప్పరపల్లిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ, ప్రతీకార దాడులూ జరగకుండా ఖాకీ బలగాలు గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఏకంగా ఒక ఏసీపీ, ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్ఐలతో పాటు 100 మందికి పైగా కానిస్టేబుళ్లను రంగంలోకి దించారు. వర్ధన్నపేట మండల చరిత్రలోనే ఒక సాధారణ వ్యక్తి అంత్యక్రియల కోసం ఈ స్థాయిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం మునుపెన్నడూ చూడలేదని మండల కేంద్రంలో ప్రజలు విస్తుపోతున్నారు. అంతిమయాత్ర పోలీసుల కట్టుదిట్టమైన నిఘా నీడలోనే సాగింది.

**నివురుగప్పిన నిప్పులా గ్రామం..**

భాస్కర్ మరణంతో ఉప్పరపల్లి గ్రామం నివురుగప్పిన నిప్పులా మారింది. ఒకవైపు కుటుంబ సభ్యుల కన్నీటి సంద్రం, మరోవైపు నిందితులపై గ్రామస్థుల తీవ్ర ఆగ్రహం వ్యక్తమయ్యాయి. కేవలం ప్రేమించాడనే నెపంతో ఇంతటి ఘాతుకానికి ఒడిగడతారా? అంటూ ప్రజాసంఘాలు, గ్రామస్థులు నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

**ఎట్టకేలకు ఊపిరి పీల్చుకున్న ఖాకీలు..**

భాస్కర్ అంతిమ యాత్ర చివరి వరకు ప్రతి క్షణం ఉత్కంఠ భరితంగానే సాగింది. ఎక్కడ ఏ చిన్న వివాదం చెలరేగినా శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనే ఆందోళన పోలీసుల్లో స్పష్టంగా కనిపించింది, ఉన్నతాధికారుల ముందస్తు ప్లానింగ్ వల్ల అంతిమయాత్ర ఎలాంటి హింసాత్మక ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఎట్టకేలకు ఊపిరి పీల్చుకున్నారు. అంత్యక్రియలు పూర్తయినా, గ్రామంలో శాంతి వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసులు ఇంకా నిఘా కొనసాగిస్తున్నారు.